# యమతీర్పు

ఆరోగ్యశాఖామంత్రి అన్నారావుకు ఆక్సిడెంటైంది.

పట్టపగలు నట్టనడిరోడ్డుమీద ఘోర ప్రమాదమైంది. వెంటనే ప్రమాద స్థలం పోలేరమ్మ జాతరలాగైంది.

"రోడ్డు ప్రమాదాలు - నివారణోయాలు" అంశంపై జాతీయ స్థాయిలో జరుగుతున్న సదస్సును ప్రారంభించి, ప్రధానోపన్యాసాన్ని గూడా పెడచెవినబెట్టి మంత్రివర్గ సమావేశానికి పరుగులు దీస్తున్న మంత్రి మారుతీకారు బ్రేకులు - మానవ శిరచ్ఛేదాన్ని ప్రత్యక్షంగా చూచిన మనిషి మెదడు నరాల్లా ఫెయిలైపోయినై.

బిజీ చౌరస్తాలో రెడ్ సిగ్నల్‌ను గౌరవించి నుంచున్న మిలిటరీ జీపును మంత్రి కారు గుద్దేసింది. అందాల కారు అర నిమిషంలో ఆరు చెక్కలైంది. డ్రైవరు కాలు ముక్కలైంది. మంత్రి గుండెకు బలమైన దెబ్బతగిలింది. అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు. ఆఘమేఘాలమీద అంబులెన్స్ వచ్చేసి హాస్పిటల్‌కు మోసుకెళ్ళింది.

దావానలంలా వ్యాపించిన వార్త సిటీని కుదిపేసింది. మంత్రులు, అభిమానులు, ఉద్యోగులతో ఆస్పత్రి అంగడి బజారైంది. అదనపు సెక్యూరిటీ బలాలు రంగంలోకి దిగాయి. పెద్ద పెద్ద డాక్టర్లు మంత్రి చుట్టూ కుక్క పిల్లల్లా మూగారు.

అరగంట గడిచింది. మంత్రి కొద్దిగా కదిలాడు. డాక్టర్ల కళ్ళు జిగేల్మన్నై.

మెల్లగా కళ్ళు విప్పిన అన్నారావు దృష్టి కిటికీలు దాటి గేటువైపు మళ్ళింది.

ఇద్దరు జమాజెట్టీలు.. తుమ్మ మొద్దులకు నల్లని ఆయిల్ పెయింట్ వేసినట్టున్న దృఢకాయులు కన్పించారు. అన్నారావులో చైతన్యం చెంగలించింది. లేచి కూచున్నాడు.

పగలు కన్పిస్తే రాత్రి కలలో కొచ్చేట్టున్నారీ రౌడీ భడవలు. వీళ్ళు నా గాంగు వాళ్ళలా లేరే... ఈ అవతారాలను నేనెప్పుడూ చూల్లేదే... ఎవరి తాలూకో... అనుకునేలోగా వాళ్ళిద్దరూ వచ్చేసి అతని ముందే నుంచున్నారు.

"ఎటొచ్చారోయ్?..." అడిగాడు హుషారుగా.

"ఇటే..." పిడికెడు మీసాలను చిటికెన వేలుతో సవరించుకున్నా డొకడు.

"ఎవరి కొరకు?"

"నీ కొరకే..." మరొకని మీసాలు విచ్చుకున్నాయి.

ఏదో పైరవీ కొచ్చుంటారు వెధవలు. ఎంత రౌడీలైతేమాత్రం సమయ సందర్భాలుండొద్దా....లోకజ్ఞానం పూజ్యమే పహిల్వాన్లకు.

"ఏం కావాలోయ్?"



ఐతా చంద్రయ్య

"నువ్వే కావాలోయ్!" కోరస్.

హమ్మ నాకొడకల్లారా! నేనెవర్నో తెలుసుకునే మాట్లాడ్తున్నారా? ఇంత గట్టి సెక్యూరిటీని ఛేదించుకుని ఎలా రాగలిగారో... అన్నారావులో అసహనం కోడెనాగులా పడగవిప్పి-కుంటిగుఱ్ఱంలా నిలబడిపోయింది.

"నాతో మీకేం పనిరా?"

"నీతోనే పనిరా!"

అయ్యో.. నా పరువు పాతాళ గంగ పాలైపోతుంది. లేచి నుంచున్నాడు.

"అచ్చం యమదూతల్లా గున్నారు, ఎవర్రా మీరు?"

"యమదూతల్లా కాదు, యమదూతల మేరా!"

"నీకీ లోకంలో నూకలు చెల్లిపోయినైనీ ప్రాణాలు తీసుకెళ్లేందు కొచ్చాంరా!"

సత్యసాయిబాబాలా గాల్లో చేతులూపారిద్దరూ. పొడగాటి రంపాలు... తళతళలాడే రంపాలొచ్చినై ఇద్దరి చేతుల్లోకి.

అతివేగంగా పరుగెత్తుతున్న ఎలక్ట్రిక్ ట్రెయిన్‌కు సడెన్ బ్రేకులు పడ్డట్టు - అన్నారావు గుండె తపీన ఆగిపోయింది.

'ఐతే...నేను చచ్చిపోయానా?"

"ఔను."

"అయ్యయ్యో... నా భార్యా.. నా పిల్లలూ... బాంక్ ఖాతాలు... బంగళాలు.. బినామీ ఆస్తులూ... నా మంత్రిపదవీ... కార్లూ.... సెక్యూరిటీ...."

"అవేవీ వెంటరావుగని పద." గుడ్లురిమాడొకడు- రంపాన్ని గాల్లో తిప్పుతూ.

"నేన్రాను.. రానంటే.. రాను... రానుగాక రాను.." పీకకోసిన మేకలా అరుపులు. భీష్మించాడు.

"నువ్వెంత అరిచి గీపెట్టినా అరణ్య రోదనమే. నడువోయ్ కుయ్యా...." మెడల మీద చెయ్యేసి ముందుకు తోసాడింకొకడు. బొక్క బోర్లా పడ్డాడు.

అమ్మో... వీళ్లకు మా పోలీసులే ట్రేనింగిచ్చుంటారు. లేచి మోచేతులు మోకాళ్ళు తడుముకుంటూ ముందుకు నడవక తప్పలేదు.

ఒక యమదూత అన్నారావు చెయ్యిబట్టుకుని లాక్కెళ్తున్నాడు. మరో యమదూత అక్కడే ఉండిపోయాడు.

"మరి.... అతడు రాడా?" అడగబోయాడు అన్నారావు. కాని, అడగలేదు.

"నీ పార్థిన శరీరం కాలి బూడిదైపోయేదాకా అతడిక్కడే ఉంటాడు."

"అట్లెందుకూ?"

"ఎందుకంటే..." ఏదో గుర్తుకొచ్చి నాలిక్కరుచుకున్నాడు యమదూత. "అదంతా నీకెందుకూ... నడువ్." రంపం పైకి లేచింది.

యమదూత సివంగి చూపులకు అన్నారావు అదిరిపోయాడు. ఎన్నో చీత్కారాలను అవలీలగా భరించిన అన్నారావు ఆ చూపులకు తట్టుకోలేక మొహం వేళ్ళాడేశాడు.

❋ ❋ ❋ ❋

"అన్నవరం పుణ్యక్షేత్రములో అడుక్కుతినే గుడ్డోడి డబ్బాలో పైస వేసి పావలా తీసుకున్నాడండీ ఈ అన్నారావు..." చిట్టా తెరిచి చదివాడు చిత్రగుప్తుడు. యమధర్మరాజు తలూపాడు. వెడల్పాంటి చెవుల రింగులు గమ్మత్తుగా ఊగాయి.

న్యాయశాస్త్ర పరీక్షను ఇన్‌స్టాల్ మెంటు పద్ధతిలో పాసై అడ్వొకేటు అన్పించుకున్న అన్నారావు రాజకీయ జీవితం అన్నవరంతోనే ప్రారంభమైంది.

మొదటి ప్రయోగం ముష్టోడి డబ్బా మీదనే... గ్రాండ్ సక్సెస్. బోలెడంత ఆత్మ విశ్వాసంతో గుండెకాయ బండరాయైంది.

అన్నారావులోని అడ్వొకేట్ మేల్కొన్నాడు.

"యువరానర్!" ఇంకేదో అనబోయాడు.

"నోర్ముయ్ నరాధమా!" గదమాయించాడు యదధర్మరాజు. కిరీటం ధగద్ధగలు గదమీద చెమక్కుమన్నాయి.

"ఎవరినోరు మూయాలండీ?"

"నీదే!" జారిపోతున్న పట్టుకౌస్తుభం పైకి లాక్కున్నాడు.

"నేను నోర్మూసుకుంటే నామీది ఆరోపణలకు సమాధానమెవరిస్తారండీ?"

"అది ఆరోపణ కాదు. అసలు నిజం. సమాధానం పేరుతో మా చిత్రగుప్తుణ్ని ఎవర్రా అంటావా దుష్టుడా?"

పాపం యదధర్మరాజుకు వయసొచ్చి చెవుడు దాపురించినట్టుంది అనుకుని.

"నేనన్నది ఎవర్రా కాదండీ! యువరానర్ అన్నానంతే. న్యాయమూర్తిని ఆంగ్లంలో అలాగే సంబోంధించాలి గదండీ? ఇక్కడ మీరే న్యాయమూర్తులు, ధర్మమూర్తులు గదా? హంస క్షీర నీరన్యాయంలా ధర్మా ధర్మ విచక్షణంలో నిష్ణాతులైన మీకు సాటి మరెవ్వరూ లేరాయె... మీ వంటి విజ్ఞుల ముందు...."

"ఏయ్! ఆపు." చిత్రగుప్తునికి చిరాకేసింది.

"పదవులకోసం కాకా పట్టడ మలవాటుపడిన ఈ రాజకీయ నరుడు మిమ్మల్ని గూడా కాకా పడ్తున్నాడు ప్రభూ!"

నల్లని మేఘం మధ్య తెల్లని మెరుపులా నవ్వాడు యమధర్మరాజు. తెల్లని పళ్ళు నల్లని మొహం మధ్య ప్రత్యక్షమై మాయమైపోయినై. మీసాల మీద చిరునవ్వు చిందులాడింది.

"కాకా గురించి కేకలెందుగ్గానీ... నీవు చెప్పేదేదో చెప్పు నరుడా!"

అన్నారావు మనసు ఆనందడోలిక లూగింది.

"అదే అన్నవరంలో శ్రీ సత్యనారాయణస్వామికి అరడజను కొబ్బరికాయలు కొట్టానండీ!..." సవినయంగా చేతులు జోడించాడు.

"అది కూడా చిట్టా కెక్కింది." చిత్రగుప్తుని పెగాలమీది బుర్ర మీసాలు విచిత్రంగా కదిలాయి. "ఎన్ని కొబ్బరికాయలు కొడితే ఏం లాభం? ఆ కొబ్బరి ముక్కలోంచి చిన్నముక్క గూడా ప్రసాదంగా స్వీకరించలేదు. ఆ పాపానికది చెల్లు...."

అది నవ్వో కవ్వింపో అర్థం కాలేదు.

"గల్లీనుండి ఢిల్లీదాకా, మామూళ్లిచి, వార్డు మెంబరునుండి మంత్రి పదవిదాకా ఎగబాకాను. కాని, ఏం లాభం? చచ్చూరుకున్నాను. ఇక్కడ పైరవీ లేవి నడిచేట్టులేవు" అన్నారావు అల్లాడిపోతున్నాడు.

"ఈ అన్నారావు ఆరోగ్యశాఖా మంత్రి. ఆంధ్రదేశంలోని ఆస్పత్రులన్నిటికీ సరఫరా చేసేందుకు విదేశాల నుండి అత్యాధునిక రోగనిర్ధారక కంప్యూటర్లు కొనుగోలు చేసినట్టు లెఖ్ఖలు రాయించి డబ్బుంతా మింగాడండి!..." మరో పద్దు చదివాడు చిత్ర గుప్తుడు.

"హయ్యారే... అంత పెద్ద మొత్తాన్ని నెలా జీర్ణించుకోగలిగాడో!?" ముక్కుమీద వేలేసుకున్నాడు యమధర్మరాజు.

"ఆ డబ్బంతా స్విస్‌బాంకులో దాచుకున్నాడండీ! ఆ రహస్యాన్ని బయట పెట్టిన నిజాయితీపరులైన అధికారుల్ని మువ్వతిప్పలు బెట్టి ముప్పై చెరువుల నీళ్ళు దాగించి శంకరగిరిమాన్యాలు పట్టించాడండీ!"

"అది కూడా రాసుందా?!" నోరెళ్ళబెట్టాడు అన్నారావు. ఆ తరువాత సర్దుకుని, "మా దేశంలో వేల కోట్ల రూపాయలు గుటకాయ స్వాహా చేసిన మహానుభావులున్నారండీ! ఆ మహనీయుల మార్గమే నా కాదర్శం. వాళ్ళముందు నేనెంతండీ చిత్రగుప్తులవారూ? ఐనా... ప్రజాధనాన్ని ఉడతాభక్తిగా భోంచెయ్యనివాడు ప్రజానాయకు డెట్లౌతాడండీ?" దబాయించబోయాడు.

"తప్పు తప్పు... .... ప్రజానాయకుడంటే ప్రజా సేవకుడు. సేవ అంటే భోంచెయ్య డంకాదు. ఐనా, ఎవడి పాపం వాడనుభవించక తప్పదు నరుడా! ఎవరికే శిక్ష విధించాలో మాకు బాగా తెలుసు, ముందు నీ సంగతి చూస్కో..." చెప్పేశాడు యమధర్మరాజు.

'ఈయన ముందటి జన్మలో మా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తయుంటాడు....' అన్నారావు అంతరంగం అల్లకల్లోలమైంది.

ఐనా.... సమాధానమివ్వాలి. లేకపోతే ఎక్స్‌పార్టీ డెసిషనైపోతుంది.

"మాననీయ యమధర్మరాజా! ప్రతి ఎన్నికల ముందు ఎందరో నిరుపేదలకు డబ్బు సహాయం చేశాను. ఇలా...ప్రతి ఎన్నికలకో కోటి రూపాయలన్నా దానం చేసుంటాను... దానికిది చెల్లవేయవచ్చు గదా?"

"దానం కాదది. దగా. డబ్బు పంచడం కాదది... ఓట్లు కొనుక్కోవడం. ప్రజల్ని ప్రలోభపెట్టి పదవికి ఎన్నిక కావడం మహాపాపం. అదిగూడా ఈ చిట్టాలో పాపాల జాబితాలోకి ఎక్కింది నాయనా!"

రాజభరణాల రద్దు కేసులా నా కేసిలా తిరగబడిందేమిటీ?.... నిప్పులమీద నడిచి నట్టనిపిస్తుంది అన్నారావుకు.

"ఇదన్యాయం. ఒకదానికి చెప్పిన సమాధానాన్ని మరోపాపంగా చిత్రించడం అన్యాయం, అక్రమం. హే యమలోకపతీ! మహిషవాహనా! ధర్మరక్షకా! ఇది మీ - అనగా మన ధర్మసూత్రాలకే విరుద్ధం తండ్రి!"

"ధర్మసూత్రాలకు విరుద్ధమా....?" యమధర్మరాజు డైలమాలో పడిపోయాడు. విచారణకై క్యూలో నిల్చున్న ప్రాణులూ, ప్రాణుల్ని లాక్కొచ్చిన యమభటాలూ, సభాసదులూ అసెంబ్లీ గ్యాలరీ ప్రేక్షకుల్లా ఆసక్తిగా చూస్తున్నారు.

బాక్సాఫీసు బద్దలు కొడదామని సినిమా రంగంలో దిగి మొదటి బొమ్మకే దిమ్మెక్కి దివాలా తీసిన నిర్మాతలాగైపోయాడు. చిత్రగుప్తుడు.

నీటిలో ఉంచిన స్పాంజి కాస్సేపట్లోనే బరువెక్కినట్టు నిమిషాల్లో బలం పుంజుకుని "అయ్యా! ఈ నరుడు నరకాసురుణ్ణి మించిపోతున్నాడండీ! మాటలతో మభ్య పెట్టి మిమ్మల్ని పల్టీ కొట్టించాలనుకుంటున్నాడు".

ఉలిక్కిపడ్డాడు యమధర్మరాజు.

ఔనౌను... నరావతారమెత్తి వచ్చిన ప్రాణులతో జాగ్రత్తగుండాలి. అలనాటి సతీ సావిత్రి, నచికేతుడు, మార్కండేయుడు గుర్తుకొచ్చారు.

"ఓయీ అన్నారావూ! మా చిత్రగుప్తుని చిట్టా అంశాలకు సమాధానం చెప్పి తీరాల్సిందే!" చెప్పేసి సర్దుక్కూచున్నాడు.

"నో.... ఈ రూలింగ్‌తో నేనే కీభవించను. తక్షణమే సభనుండి వాకౌట్ చేస్తా." మొత్తుకున్నాడు అన్నారావు, కాని, అది అసెంబ్లీ కాదని గుర్తుకొచ్చి హతాశుడయ్యాడు.

"నీ ఏకీభావంతో మా కెలాంటి సంబంధం లేదు." మరో రూలింగ్.

"భారతదేశంనుండి వచ్చే మానవుల్ని విచారించడం కష్టమై పోయింది. ప్రభూ! మాటిమాటికి ఆంగ్ల పదాలుపయోగిస్తారు. అదే ఇంగ్లండ్ నుండో మరో దేశంనుండో వచ్చినవారైతే ఎంచక్కా వాళ్ళ మాతృభాషలోనే సంభాషిస్తారు, ఇతర భాషా పదాలు వాడరు."

"ఏం చేద్దాం చిత్రగుప్తా! పిల్ల పోయినా పురిటికంపు పోనట్టు - భారతదేశంనుండి ఆంగ్లేయులు వెళ్ళిపోయినా ఆ భాషా, సంస్కృతులు మాత్రం పోనంటున్నై. చదువుకున్న నరులంతా అలాగే మాట్లాడ్తారు, మనమే సర్దుకుపోవాలి."

యమధర్మరాజు మాటలకు అన్నారావు పొంగిపోయాడు.

చిత్రగుప్తుని చిట్టా పేజి తిరిగింది.

"ఈ అన్నారావు షేర్ల వ్యాపారం కుంభకోణంలో కోట్ల రూపాయలు గోల్‌మాల్ చేశాడు. ఆ కుంభకోణం గురించి విచారించిన ప్రభుత్వ కమిటి గూడా ఇతన్నే తప్పుపట్టింది. కాని, ఆ కమిటీ రిపోర్టును మసిబూసి మారేడుకాయ జేసి ప్రజలకు శఠగోపం పెట్టాడు మహాప్రభూ!"

ఒర్నాయనో... అక్కడ తప్పుకున్నా ఇక్కడ తప్పుకునేట్టులేదే! ఈ చిత్రగుప్తుణ్ణీ వాని చిట్టాను మా రాయలసీమ హాండ్ బాంబ్‌తో లేపేస్తే బాగుండును... అన్నారావు పళ్ళు పటపటలాడినై. కాని ఏంలాభం? బుర్రలో ఓ మెరుపు....

"ఆ పాప పరిహారార్థం నా కొడుక్కి ఓ నిరుపేద పిల్లతో పెళ్ళి చేసానండి! నయాపైస కట్నంగూడా అడగలేదు."

"ఆ అమ్మాయిని మీ వాడు బలాత్కారంచేస్తూ పట్టుబడ్డాడు. కాబట్టి తప్పలేదు. దాంతో పాపపరిహారం కాదు. కట్నం తీసుకోవడం మహాపాపం. నువ్వా పాపం చెయ్యాలేదంతే. ఆ పెళ్ళయ్యాక నీ కొడుకునో ఆదర్శ యువనాయకుడిలా నుంచో బెట్టి ఎమ్మెల్లేగా గెల్పించుకున్నావు గదా! నీ మంత్రి పదవిని వాడు చేపట్టటోతున్నా డిప్పుడు."

పాతాళంలోకి కూరుకుపోతున్నట్టనిపించింది అన్నారావుకు. కోపంతోపాటు ఏడుపుగూడా ముంచుకొస్తోంది.

"ఈ చిత్రగుప్తులవారి చిట్టా కెదురులేదా మహాప్రభూ?"

సూర్యకిరణాలు సోకిన చిరుపద్మంలా విచ్చుకున్నాయి యమధర్మ రాజు పెదాలు.

"నరుడా! భూలోకంలో కంప్యూటర్లు ఇప్పుడిప్పుడే వస్తున్నై. కాని, వాటి గురించి వేదాల్లో చెప్పబడిన సంగతి ఎంతమందికి తెలుసు? మా చిత్రగుప్తుని చిట్టాను మించిన కంపూటర్ న భూతో న భవిష్యతి. ఈ కంప్యూటర్ ఎప్పుడూ చెడిపోదు. మరమ్మతులుండవు. జీవుడు చేసిన పాపపుణ్యాలన్నీ ఎప్పటికప్పుడు ఇందులో కెక్కిపోతాయి. దానికి తిరుగు లేదు....."

ఆశ్రిత పక్షపాతం, రాజకీయ ప్రత్యర్థుల ధారుణ హత్యలు, స్థానిక దేవాలయాలకు విరాళాలు... అన్నారావు పాపపుణ్యాల గురించి చాలాసేపు నివారణ కొనసాగింది.

"ఈ నరాధముడిని ఘోర నరకంలో పడవేయడం తప్ప ఇంకే ముంది చిత్రగుప్తా?" సమాలోచనగా చిత్రగుప్తుడివైపు చూచాడు యమధర్మరాజు.

"చిత్తం అంతేకదా?"

"దేవా! మహానుభావా!! యమధర్మరాజా!" అన్నారావు ఆత్మనిప్పులదొక్కిన కొండముచ్చైంది. "ధర్మప్రభువులు! మీరే ఇట్లంటే నాగతేంకావాలి? కనీసం మామూలు నరకానికన్నా పంపించడి ప్రభూ!" కాళ్ళమీద పడాలని ముందు కురికాడు.

దిగ్గువ లేచాడు యమధర్మరాజు.... "వీడు నా కిరీటం లాక్కొని ఈ పీఠమెక్కాలని ఉరికొస్తున్నాడు. ఆపండి. వాణ్ణక్కడే ఆపండి" గట్టిగా చెప్పాడు. యమలోకం దద్దరిల్లింది.

నలుగురు యమదూతలు అన్నారావు రెక్కలు పట్టి వెనక్కు నెట్టివేశారు. నిలదొక్కు కోబోయి వెల్లకిలా పడిపోయాడు.

ఓర్ని.... అ సెంబ్లీ మార్షల్స్‌లా చేతులమీద ఎత్తుకెళ్తారనుకుంటే ఇలా పడేస్తారా?

"ఒరేయ్! మీరు భూలోకంలో ఎనుబోతులై పుడతార్రా..." ఉక్రోషం పొడుచుకొచ్చి ంది కాని, ఏం లాభం?

మెల్లగా లేచాడు.

పాతబడిలో చేరిన కొత్త శివుతరగతి విద్యార్థిలా చేతులు కట్టుకునుంచున్నాడు.

"ఓయీ అన్నారావూ!" గుండెల నిండా గాలి పీల్చుకుని కూచున్నాడు యమధర్మ రాజు "జన్మలలో సర్వోత్కృష్టమైనది మానవజన్మ. కన్నభూమిని, ఆదరించిన సమాజాన్ని సేవించి, ఆ పుణ్యంతో మోక్షాన్ని పొందేందుకు మానవజన్మమే చివరి అవకాశం. ఆ సంగతి మరిచిన మానవుడు తుచ్ఛమైన సంపదలు మూటగట్టుకుంటూ, పూర్వజన్మల పాపభారాన్ని మరింత పెంచేసుకుంటుంటే ఘోరనరకం తప్ప ఇంకేం లభిస్తుంది?...."

అన్నారావుతో పాటు మిగాతా ప్రాణులు గూడా శ్రద్ధగా వింటున్నారు.

"రాజా... యమధర్మరాజా!" దూరంనుండి కేక.

అన్నారావు ప్రాణాల కోసంవచ్చి ఆస్పత్రిలోనే ఉండిపోయిన యమదూత పరుగెత్తుకొస్తున్నాడు.

"ఏమిటి.... ఎందుకా పరుగులు?" చిత్రగుప్తుడు అయోమయంలో పడిపోయాడు.

ఆయాసంతో రొప్పుతున్న యమదూతకు నోటిమాట రాలేదు.

ఒకే పార్టీలో కలిసి పంజేసి వేరే పార్టీలో చేరిన ఆప్తమిత్రుడు అమెరికాలో కన్పించినట్టనిపించింది అన్నారావుకు.

"నమస్తే మిత్రమా!" ఉల్లాసంగా అతని దగ్గరికెళ్ళాడు. కాస్సేపు వీపు నిమిరాడు.

"భటుడా! ఏమైందీ?" గంభీరంగా అడిగాడు యమధర్మరాజు.

"అయ్యా!.... "కాస్తనెమ్మదించింది యమదూతకు." ఈ అన్నారావు చనిపోగానే అతని కళ్ళను తీసి ఓ గుడ్డోడి కమర్చారయ్యా! ఆ గుడ్డోడికి చూపొచ్చిందయ్యా!"

"ఔను....నేను బతికుండగానే నా కళ్ళను ఐ బాంక్‌కు రాసిచ్చాను ప్రభూ!" గుడ్డోడికి చూపొచ్చినంత సంతోషమైంది అన్నారావుకు.

"ఐతే... అది నేత్రదానమన్నమాట!...." చిత్రగుప్తుడు గబగబా చిట్టాలోకి చూచాడు.
"ఔను... అదిప్పుడే మన చిట్టాలో కెక్కింది ప్రభూ!"

యమధర్మరాజు మొహం ఫోకస్ బల్బులా వెలిగింది. "సర్వేంద్రియాణాం. నయనం ప్రధానం. నేత్రదానంతో పాపాలన్నీ హరించుకు పోయినై. ఈ అన్నారావును స్వర్గానికి పంపిస్తున్నాం."

యమతీర్పు వెలువడింది.

(అన్వేషణ వారపత్రిక 17 మే 1995)

